క్లుప్తంగా

జిల్లా ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎస్పీని కలిసిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ కడప జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కలిశారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజద్ బాషా, జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప మేయర్ కె.సురేష్ బాబులు ఉన్నారు. కడపలో ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై ఎస్పీతో నాయకులు చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ యానాదయ్య, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్‌ఎండీ షఫీ, ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, ఫయాజ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

25 నుంచి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 రోజులు టైలరింగ్, 35 రోజులు బ్యూటీ పార్లర్‌లో శిక్షణ ఇస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 – 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు, యువతుల ఈ శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి శిక్షణా ప్రదేశంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

లిఫ్ట్ ఏర్పాటులో అక్రమాలపై విచారించండి

కడప సెవెన్‌రోడ్స్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయ లిఫ్ట్ ఏర్పాటులో చోటుచేసుకున్న అక్రమాలపై సత్వరమే విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని బ్రౌన్ గ్రంథాలయ సహాయ మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ కోరారు. కొత్త ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం ఆయన కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఏర్పాటులో జరిగిన అవకతవకలపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



షాహినాజ్ బేగం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లైడ్ మ్యాథమేటిక్స్ స్కాలర్ వి.షాహినాజ్ బేగంకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ఆ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో 'నానోఫ్లూయిడ్‌ల ఉష్ణప్రసరణ ఉష్ణ బదిలీపై స్నిగ్ధత, క్రియాశీలత శక్తి ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. షాహినాజ్ బేగంను వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అభినందించారు.

పెన్షనర్లకు డీఏ ప్రకటించాలి

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు డీఏలు ప్రకటించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కడప తాలూకా అధ్యక్షులు కంభం చిన్నయ్య తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏతోపాటు కరువు భత్యాన్ని తక్షణమే విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించడంతోపాటు 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు.

అమ్మవారి కటాక్షం అందరిపై ఉండాలి



కడప కార్పొరేషన్ : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శంకరాపురంలోని బ్యాంక్ వీధిలో ఉన్న అమ్మవారి ఆలయంలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఇద్దరిపై కేసులు నమోదు

కడప అర్బన్ : నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన విజయభాస్కర్‌రెడ్డి, తనను రిటైర్డ్ ఎస్‌ఐ పెంచలయ్య, ఆయన కుమార్తె ఆయిల్‌ట్యాంకర్‌ల కోసం పొందిన రుణాలు, సబ్సిడీల వ్యవహారంలో తమను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని దగ్గరున్న ఆధారాల మేరకు సీఐ బి.రామకృష్ణ పై ఇద్దరిపై చీటింగ్, బెదిరింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

దేవీ దర్శనం.. సర్వపాప హరణం

దసరా శరన్నవరాత్రుల రెండవరోజైన మంగళవారం కడపలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానంగా నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలనంతరం అమ్మవార్లను పూజారులు విశేషంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ, అన్నప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, పోలీసులు బందోబస్తు కల్పించారు. అమ్మవారిశాల వీధిలో భక్తుల సందడి కనిపించింది. కాగా బావనారుషి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకుంది.

– కడప సెవెన్‌రోడ్స్/కడప వైఎస్‌ఆర్ సర్కిల్



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గాయత్రి దేవీ అలంకారంలో లక్ష్మీదేవి




కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాజేశ్వరిదేవిగా పార్వతీ దేవి



శ్రీకృష్ణ అలంకరణలో గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి



నాగరాజుపేటలో మంగళగౌరీగా శ్రీ రాజేశ్వరీదేవి



బాలా త్రిపురసుందరీగా శ్రీలలితాంబికా దేవీ



కడప సెవెన్‌రోడ్స్: కన్యకాంబను దర్శించుకుంటున్న భక్తజనం



బ్రహ్మచారిణిగా విజయదర్గమ్మ



మీనాక్షిదేవిగా శ్రీ బాలపోలేరమ్మ



అలంకరణలో కామకోటి కళాంబదేవి



శ్రీ రాజరాజేశ్వరీగా నడివీధి గంగమ్మ



భావనరుషి ఆలయంలో..

దుకాణదారులు రోడ్లను ఆక్రమించరాదు

కడప అర్బన్ : దుకాణదారులు నిర్దేశించిన ప్రదేశాలలో వ్యాపారం చేసుకోవాలని కడప అర్బన్ డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు వ్యాపారులకు సూచించారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ షెల్కే ఆదేశానుసారం డీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన మార్గాలను ఆయన ట్రాఫిక్ సీఐ, సిబ్బంది కలిసి పరిశీలించారు. అనంతరం కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలన్నారు. రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేయకూడదని తెలియజేశారు. దీని వల్ల ప్రజలకు కలిగే అసౌకర్యాలను వివరించారు. ప్రధాన మార్గాల్లోని దుకాణాల్లో వ్యాపారాలు చేసేవారు రోడ్డుపై వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. సూచనలు అతిక్రమించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రహదారులపై అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాల కోసం కొత్తగా 'వెహికల్ వీల్ లాక్స్' ఉపయోగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించే విధంగా అసెంబ్లీలో చర్చించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలానే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆదుకునేందుకు స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. సెస్ రూపంలో వందల కోట్ల రూపాయలు లేబర్ డిపార్ట్‌మెంట్‌కి చేరుతున్నప్పటికీ, ఆ నిధులు కార్మికుల సంక్షేమానికి వినియోగించకపోవడం ఆందోళనకరమని తెలిపారు. 46 వేలకుపైగా పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే క్లియర్ చేయాలని, లేనిపక్షంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాసాలను ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.మద్దిలేటి, కేసీ బాదుల్లా, బి.రామాంజనేయులు, లింగన్న పాల్గొన్నారు.

దళితుడి భూ సమస్యను పరిష్కరించండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చాపాడు మండలం శ్రీరాములుపేట దళితవాడకు చెందిన కుచ్చుపాప నరసింహులు భూ సమస్యను అధికారులు మానవత్వంతో స్పందించి పరిష్కారం చూపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జయచంద్ర మాదిగ కోరారు. మంగళవారం ప్రకాశ్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాపాడు మండలంలోని బూడిదపాడు పొలం సర్వే నెంబరు 90–2ఏలో 40 సెంట్ల వ్యవసాయ భూమి నరసింహులు నాయనమ్మ సుబ్బమ్మ పేరుతో డీకేటీ పట్టా ఉందన్నారు. ఆమె మరణానంతరం నరసింహులు వ్యవసాయం చేసుకుంటున్నాడని చెప్పారు. 2002 వరకు వృద్ధురాలి పేరు మీద ఉన్న రికార్డులను భూ సర్వే అనంతరం రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ నుంచి తొలగించారన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన నల్లగొండ మల్లికార్జున ఆ భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి న్యాయం చేయాలని కోరినా స్పందించకుండా ఆక్రమించిన వ్యక్తికి తహసీల్దార్ వత్తాసు పలకడం అన్యాయమన్నారు. ఈ సమస్యను జేసీ దృష్టికి తీసుకెళ్లగా బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించినా పరిష్కరించకుండా కాలాయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరారు.



భూమి పత్రాలను చూపుతున్న బాధితులు

బిడ్డలు లేని వారికి దత్తత ఓ వరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బిడ్డలు లేని భార్యాభర్తలకు చిన్నారుల దత్తత ఒక వరమని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ మేనేజర్ కుమారి తెలిపారు. జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ పీడీ ఆదేశాల మేరకు జిల్లా సమగ్ర బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బాల సంజీవని 2.0 కార్యక్రమంతోపాటు చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్నదని, పిల్లలు లేనటువంటి వారికి పిల్లలను పొందటానికి ఇది మంచి అవకాశమన్నారు. అనధికారికంగా దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరం అవుతుందని హెచ్చరించారు.

పిల్లలను దత్తత తీసుకునే వారు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి డి–బ్లాక్, కొత్త కలెక్టరేట్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబుచాన్‌తోపాటు అడిషనల్ డీఎంహెచ్‌ఓ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, హాస్పిటల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ ఉండకూడదు

కడప కార్పొరేషన్ : డ్రైనేజీ కాలువల్లో ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.ఎస్.రమేష్ అన్నారు. మంగళవారం ఆయన నార్త్‌జోన్, వెస్ట్‌జోన్‌లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. క్లాప్ ఆటోలు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే విధంగా శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలంఖాన్‌పల్లె, దస్తగిరి పేటలో డ్రైనేజీ కాలువలు నిండి ఉండటం చూసి వాటిని శుభ్రం చేయాలని, ఖాళీ ప్రదేశాల్లో ఉన్న నీళ్లను తొలగించి నిలిచి ఉన్న నీళ్లలో ఆయిల్ బాల్స్ వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగసుబ్బయ్య, పూజిత్ రెడ్డి, చలపతి, సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.



మెమెంటో అందుకుంటున్న అధికారి మునాఫ్



అవార్డు అందుకుంటున్న నవీన్‌బాబు

పోస్టల్ ఉద్యోగులకు అవార్డులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/కడప కోటిరెడ్డిసర్కిల్ : పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని ఏపీ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ నెహతా తెలిపారు. మంగళవారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో కడప డివిజన్ పోస్టల్ ఉద్యోగులకు జిల్లా స్థాయి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు అవగాహన కార్యక్రమం, డివిజన్ స్థాయి అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో రాణించిన ఉద్యోగులను సన్మానించారు. పోస్టల్‌లోనే తక్కువ ప్రీమియం.. బోనస్ ఎక్కువ అని అధికారులు తెలియజేశారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

కడప కార్పొరేషన్ : నగరమంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నార్త్, సౌత్ జోన్‌లలో కమిషనర్ పర్యటించారు. 39/1 సచివాలయం పరిధిలో చెత్త సేకరణ చేస్తున్నారా, కాలువల్లో పూడికను తొలగిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలువ మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలంటూ సూచించారు. అమ్మవారిశాలను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థానాలు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతోనే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని మాజీ హెల్త్ అండ్ మెడికల్ ఆఫీసర్ గుణశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మను పాలిటెక్నిక్‌లో స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్'పై సదస్సును నిర్వహించారు. గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవనంలో ఉన్నత స్థానాలు సంపాదించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అనేవి తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇన్‌చార్జ్ మిర్జా విలాయత్ అలీ బేగ్, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్ర బాబు మాట్లాడుతూ రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యశ్వంత్, సయ్యద్ బాషా, హుస్సేన్ వలీ పాల్గొన్నారు.

ఆర్‌సీఎం ఎయిడెడ్ పోస్టుల భర్తీలో అక్రమాలు

కడప ఎడ్యుకేషన్ : ఆర్‌సీఎం ఎయిడెడ్ పోస్టుల భర్తీలో చేటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో విద్యార్థి, యువజన ప్రజా సంఘం నాయకులు మంగళవారం ఆర్జేడీని చుట్టుముట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్‌ఎస్ రాజా, అంకన్నలు మాట్లాడుతూ కొంత మంది మతమార్పిడులను ప్రోత్సహిస్తూ తప్పుడు సర్టిఫికెట్లు ఆధారంగా ఎంపికలు చేశారని ఆరోపించారు. గత విద్యా సంవత్సరం ఎయిడెడ్ పోస్టుల నియామకాలు జరిగాయని విద్యార్థులు లేని పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయించుకుని అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఈ నియామకాల్లో అక్రమాలు చేటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైనా విచారించి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జయవర్ధన్, బాస్కర్, డిఎం ఓబులేసు, జగదీస్, నాగరాజు, జయరాజు, జగన్‌నాయక్, బయ్యన్న, సుధాకర్, సుబ్బరావు, బాలు, మహేశ్వర్, ఓబయ్య, రాజేంద్రప్రసాద్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలోని యూపీహెచ్‌సీలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీడీపీఓ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వాణిశ్రీ, ఏసీడీపీఓ శోభారాణిలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాబుచాన్, అధికారులు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్త అవసరం

కడప : ప్రజల్లో ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్త ఎంతో అవసరమని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున తెలియజేశారు. ఫార్మకవిజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా నగరంలోని రామిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, నర్సింగ్ కాలేజీ ఇతర విద్యాసంస్థల్లో ఔషధాల దుష్ప్రభావాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టర్ టి.జమున ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ ఇన్చార్జ్ హెచ్‌ఓడీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, పీజీ విద్యార్థులు, వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కడప ఎడ్యుకేషన్ : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారులు సూచించారు. మంగళవారం ఎస్‌కేఆర్ – ఎస్‌కేఆర్ (కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల) డిగ్రీ కళాశాలలో స్వస్థ నారీ సశక్త్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ వేముల సలీం బాషా ఆధ్వర్యంలో ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ షాకీర్ హుస్సేన్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు, సిబ్బంది సమస్యలను డాక్టర్ గారికి తెలిపి సలహాలను తీసుకోవడం జరిగింది. అనంతరం స్టాఫ్, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నసీమా విద్యార్థులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



అన్నదానం చేస్తున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : భారతదేశం మతసామరస్యానికి ప్రతీక అని, మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో అందరూ నడవాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజద్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 30వ డివిజన్‌లోని రవి గ్రూప్ ఆఫ్ థియేటర్స్ ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మౌలా ఆధ్వర్యంలో బార్మీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ఫాతేహా నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మతపెద్ద వలీవుల్లా హుస్సేనీ, 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ, మన్సూర్, ఫైరోజ్, నూరుల్లా, ఫారూఖ్ పాల్గొన్నారు.

సంస్కరణలపై ఆర్టీసీ దృష్టి సారించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆర్టీసీలో సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల క్రితం బస్సులో సీటు కోసం ప్రయాణికులు ఏ విధంగా అవస్థలు పడ్డారో.. ప్రస్తుతం కూడా తీరు మారడం లేదన్నారు. ప్రపంచమంతా అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఆర్టీసీ మాత్రం పాత విధానాన్నే అనుసరించడాన్ని తప్పుబట్టారు. ఈ విషయమై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి సారించి ప్రయాణికులకు టికెట్‌లను బస్టాండ్ కౌంటర్‌లలోనే విక్రయించి సీట్లు కేటాయించాలని తెలియజేశారు. దీంతో తోపులాటలు, ప్రయాణికుల మధ్య ఘర్షణలు ఉండవన్నారు.